# టి.ఎస్.ఎ కథ
# 2014



## టి.ఎస్.ఎ కృష్ణమూర్తి

2014 లో ప్రచురించబడిన టి.ఎస్.ఎ కృష్ణమూర్తి
కథల సమాహారం

# టి. ఎస్. ఎ. కథ - 2014

(కథా సంపుటి)

టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి

కళా ప్రచురణలు

మదనపల్లె - 517 325, చిత్తూరు జిల్లా

TSA కథ 2014
ప్రథమ ముద్రణ : జూన్ 2015
ప్రతులు : 1000
హక్కులు : © రచయితవి

కళా ప్రచురణలు – 6
మదనపల్లె – 517 325
వెల : ₹ 75/–

ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రములు
లేదా

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
3–169–16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ దక్షిణపు వీధి
**మదనపల్లె – 517 325**
చిత్తూరు జిల్లా
ఫోన్ : 08571 – 221963
సెల్ : 93472 98942
email : todimellakrishnamurthy@gmail.com

ముఖచిత్రం : **అన్వర్, హైదరాబాదు**
సెల్ : 9553955791

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్**
గోసులకురప్పల్లి రోడ్డు,
చౌడేపల్లి – 517 257
చిత్తూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్.

# ఈ సంపుటిలో.......

*ఎవరి విమానం పైకెగిరినా...* **7**

*'ఆదివారం ఆంధ్రభూమి' 23 – మార్చి – 2014*

*శ్మశానంలో వసంతం* **16**

*'స్వర్ణభూమి' మాసపత్రిక మార్చి – 2014*

*పిలుపు రావడంలేదుకదా?!* **26**

*'నవ్య వీక్లీ' 12 నవంబర్ – 2014*

*శవంకాలాన వాసన* **36**

'విశాలాక్షి' మాసపత్రిక మే – 2014

*ఉరిఎవరికి?* **42**

*'నవ్య వీక్లీ' 2–ఏప్రిల్ –2014*

*డిసెంబరు10* **51**

*'ఆలోచించండి' మాసపత్రిక మార్చి – 2014*

*బలిపశువులు* **56**

*'శ్రీమతి కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు సంపుటి, 12–6–2014*

*చివరిచూపు* **63**

*'ఆలోచించండి' మాసపత్రిక ఏప్రిల్ – 2014*

*కర్తృత్వము* **67**

*ఉషోదయవెలుగు' త్రైమాసిక జూలై 2013 నుండి జూలై 2014 వరకూ*

# ఎవరి విమానం పైకెగిరినా...

సద్గుణరావు స్వయంగా ఇంటికి వచ్చి ఆహ్వానించాడు. స్నేహితుల రోజు నాడు కృష్ణమనాయుడు గెస్ట్ హౌస్‌లో చిన్ననాటి మిత్రుల కలయికలతో జరిగే చిన్న విందుకు హాజరు కావాలన్నది సారాంశం.

'ఆరోజు నేనూ రానా?' అని ప్రశ్నించింది నా శ్రీమతి... సద్గుణరావు వెళ్లిపోయాక. అవసరం లేదన్నట్టుగా పెదవి విరిచాను.

నేనయినా వెళ్లాలా? వద్దా? అని ఆలోచించాను అపై.

సద్గుణరావు మీదయితే నాకేనాడు సదభిప్రాయం లేదు ఐదేళ్ల వయసులో ప్రాథమిక పాఠశాలలో మాతో కలిసి చదువు ప్రారంభించినప్పటి నుండి ఏభయి ఐదేళ్ల వయసులో నేటి వరకు కూడా నేను సద్గుణరావును గౌరవించిందీ, ప్రేమగా ఆత్మీయంగా మాట్లాడిందీ చాలా అరుదు. అయితే ఆ విషయాన్ని తనెప్పుడు పెద్దగా పట్టించుకున్నట్టు కన్పించదు. తనెప్పుడు తారసపడినా నవ్వుతు గౌరవంగా మట్లాడుతాడు.

అయినా నా దృష్టిలో అతడు ఫిట్ ఫర్ నథింగ్!

చదువులో అయితే ఎప్పుడూ ఫస్ట్... కానీ తన కుటుంబ ఆర్థిక కారణాల వల్ల ఇంటర్‌తో ముగించుకోవాల్సి వచ్చింది. అయితే అదృష్టవశాత్తు అందివచ్చిన అటెండరు పోస్టులో సంకోచించకుండా చేరిపోయి జవానుగానే పదేళ్లు, రికార్డు అసిస్టెంటుగా పదేళ్లు పని చేసాక ప్రస్తుతానికి గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు. అదయినా సజావుగానా?.. నిజాయితీ, చట్టుబండలు అంటూ అధికారులు ఆగ్రహాలకు గురవుతూ తరచు బదిలీలతో గుదిబండ జీవితాన్ని గడుపుతున్నాడు.

అతని పిల్లలిద్దరూ... ముత్యాలు... తెలివైనవారు! కానీ వారికి తగిన చదువులు అందించలేకపోయాడతడు. అతని పిల్లలు కూడా తండ్రిని దాటి పోకుండా తమకు అందుబాటులో వున్న చదువులతోనే ప్రతిభ కనబరుస్తున్నారు.

ఊర్లో ఇల్లు లేదు! అడవిలో చేను లేదు! అంగడి భత్యం, తంగడి కట్టెలు అన్నట్టుగా అద్దె ఇంట్లో అరకొర జీవితాలు గడిపే కుటుంబం అతనిది. అప్పో, సప్పో చేసయినా స్వంత ఇట్లు కట్టుకోవాలన్న ఆలోచన కూడా అతనికున్నట్లు లేదు!

అందుకే తనంటే నాకు ఒళ్లుమంట. కొద్దో, గొప్పో చిన్న చూపు నాకు.

చిన్న వ్యాపారంతో ప్రారంభించి కోట్లకు పడగలెత్తి ప్రస్తుతానికి ఊర్లోని పెద్ద మనుషులలో ఒకడినయ్యాను. సద్గుణరావు ఆహ్వానాన్ని మన్నించి నా విలువైన కాలాన్ని వెచ్చించి వెళ్లడమా? మానుకోవడమా? అని తర్జన భర్జన పడ్డాను మనసులో. పైగా కృష్ణమనాయుడుతో తప్ప తతిమ్మా చిన్న నాటి స్నేహితులనెవర్నీ ఈ మధ్య కలిసింది లేదు... కలవాల్సిన అవసరమూ, అవకాశము వచ్చిందీ లేదు!

"నన్ను తీసుకువెళ్లకపోతే పోయారు..మీరయినా వెళ్తున్నారా? లేదా?" అని ప్రశ్నించింది నా శ్రీమతి నా అలోచన పసిగట్టి.

"పనుల తొందర ఉంది కదా?" అన్నాను.

"పని వ్యామోహం జీవితంలోని విలువైన క్షణాలన్నింటినీ హరించివేస్తుందని అంటారండీ హోనిమన్. పని ఎప్పుడూ ఉండేదే కానీ తప్పక వెళ్లి రండి. చిన్ననాటి మిత్రులను కలుసుకోగలగడం అన్నది నిజంగా గొప్ప అదృష్టం!" అంది చిన్నగా నవ్వి.

నా శ్రీమతి సుగాత్రి అందంగా నవ్వుతుంది. బహుశా ఆ నవ్వు చూసే కట్నం విషయంలో పట్టుపట్టకుండా తన పట్లే మొగ్గు చూపి వుంటాను ఆ రోజులలో!

"కార్యేషు దాసీ కరణేషు మంత్రీ
రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ
భుక్తేషు మాతా, శయనేషు రంభా
షట్కర్మయుక్తా...కులధర్మ పత్నీ!"

పై పద్యాన్ని ఏ మహానుభావుడు లిఖించాడో కానీ ఆ 'కరణేషు మంత్రీ' అన్న అక్షరాలను మాత్రం నా శ్రీమతి లాంటి వారినే గమనించాక ఏర్చి, కూర్చి వుంటారు బహుశా. అడగకపోయినా అమూల్యమైన సలహాలను అందించడంలో నాకు నిజం గానే మంత్రిలా వ్యవహరిస్తుంటుంది తను.

తను అలా అనగానే ఆ ఫంక్షన్‌కు వెళ్లాలనే నిశ్చయించుకున్నాను.

* * *

తారు రోడ్డులోంచి కృష్ణమనాయుడి గెస్ట్ హౌస్‌కు వెళ్లే మట్టి దారిలోకి తిరిగే మలుపులోనే చిన్న షామియానా, స్వాగత వచనాలతో బ్యానర్ కనిపించాయి.

గెస్ట్‌హౌస్‌లోనో వెనక తోటలోనో మంచి భోజనాలు ఏర్పాటు చేసి 'ఫ్రెండ్‌షిప్‌డే'ను పాత మిత్రులతో కలిసి జరిపిస్తారనుకున్నాను కానీ, తోటకూ గెస్ట్‌హౌస్‌కు మధ్యన పచ్చని ప్రకృతిలో... రావి, వేప చెట్ల నీడన ఓ కొత్త ప్రపంచాన్ని పాతబంగారు లోకంలా సృష్టిస్తారని మాత్రం నేననుకోలేదు.

పెద్దంత షామియానా కింద ఓ మోస్తరు స్టేజితో సభా వేదిక రకరకాల సహజ పూలహారాలతో సువాసనలు వెదజల్లుతు అలంకరింపబడి ఉంది. ఎక్కడా రంగు కాగితాలు ఉపయోగించబడలేదు.

ఆ సభా ప్రాంగణం దగ్గరకు చేరుకుంటుండగానే నా కంట కన్నీరొలికింది అప్రయత్నంగా! కారణం.........

స్టేజిమీద వక్తలకోసం ఏర్పాటు చేయబడ్డ చిన్న డయాస్ పక్కన ఓ పెద్ద బల్లమీద వుంచబడ్డ మూడు ఫోటోలు.... మోటారు సైకిల్ ప్రమాదంలో చనిపోయిన మహబూబ్ బాషా, జాండిస్‌తో మరణించిన చాముండేశ్వరి ఫోటోలు అటు ఇటు వుండగా మధ్యలో కాస్తపెద్ద ఫోటో ఎడ్వర్డ్‌ది.

వాడు కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి చనిపోయినప్పుడు గానీ, వాడి శవం ఇక్కడికి వచ్చినప్పుడు కానీ, అమరవీరులకు ఇవ్వబడే గౌరవాలతో వాడి అంత్యక్రియలు సమాధుల తోటలో జరిగినప్పుడుకానీ, ఆ తరువాత చాలా రోజులకు ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ఎడ్వర్డ్ భార్య ఎలిజా రాష్ట్రపతి నుండి 'శౌర్యచక్ర' పురస్కారం అందుకోవడాన్ని టీవిలో చూసినప్పుడు కానీ నేనింత బాధపడలేదు... ఇంతటి భావోద్వేగానికి గురికాలేదు!! కానీ ఇక్కడ ఎడ్వర్డ్ యూనిఫాంలో వున్న ఆ ఫోటో....

పూలమాలతో అలా కన్పించేసరికి... నిజానికయితే ఆ ఫోటో అలా కన్పించడమే కాదు, అదే సమయానికి స్పీకరు బాక్సులోంచి వినవస్తున్న గానం...

'యే మేరే వతన్‌కే లోగో
జర ఆంఖోమె భర్‌లో పానీ
జో షహీద్ హు యేహై ఉన్‌కీ
జర యాద్ కరో ఖురబానీ...'

ఆ అమృత గాతం అప్పుడలా వినవస్తూ ఆ ఫోటో పూలమాలతో కళ్లబడేసరికి నా కళ్ల నుండి జల జల కన్నీరొలికిపోయింది అలా అప్రయత్నంగా!

ఆ పాట వెనక సైతం ఎంతోమందికి తెలియని చాలా చారిత్రక విషయం ఉంది. నా చిన్నతనంలో...ఆ పాట రేడియోలో ఎప్పుడు వినవచ్చినా... దేశాన్ని అమితంగా ప్రేమించే మా తాతగారు ఆ పాటను గూర్చి పదే పదే చెప్పి అర్ధాన్ని కూడా వివరించే వారు! నాకయినా అలా తెలిసింది!అంతే!!

"మేం ప్రపంచ ప్రేమికులం. మాకు విరోధులు లేరు!" అని అంటూ, అనుకుంటూ ఉండిన భారతీయుల హృదయాలను, భారత భూభాగాన్ని చైనీయులు 1962వ సంవత్సరంలో తమ తుపాకులతో, శతఘ్నులతో, విమానాలతో బద్దలుకొట్టేశారు. నిజానికి ఆ యుద్ధంలో భారతదేశం కొంత పరాజయాన్ని, చాలా పెద్ద నష్టాలను చవి చూసింది.

యుద్ధం ముగిసిన పిదప అమరులైన భారత వీరజవానుల కోసం గుండె చెరువు చేసుకుని తన కోకిల కంఠం నుండీ విషాదాన్ని జాలు వారుస్తూ ఆ పాటను గానం చేశారు లతా మంగేష్కర్. ఆ పాట విన్నప్పుడు భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ... 'బేటా, తేరె గాన్‌సే ఆజ్ హమ్‌కో రోనా అయా!' (బిడ్డా, నీ పాట విని ఈ రోజు దు:ఖం ఆపుకోలేకపోయాను) అన్నారు. ఆ గానం ద్వారా మనకందుతున్న సందేశం ఏమిటంటే...

"నా దేశ ప్రజలారా... సంతోషంగా ఉన్నారు కదా? మన త్రివర్ణ పతాకం స్వేచ్ఛగా ఎగురుతున్న శుభదినం మనకిది. పర్వత శ్రేణులలో బలిదానాలతో ప్రాణాలువదిలి తమ తమ ఇళ్లకు తిరిగి రాలేకపోయిన అమరవీరులను మననం చేసుకుంటూ కాస్త కళ్లలో కన్నీరు నింపుకోండి! హిమాలయాలు గాయపడి మన స్వాతంత్ర్యం కష్టాల్లో పడ్డప్పుడు తమ గుండెల్ని ఎదురొడ్డిపోరాడి అసువులు బాసిన వారి త్యాగాలను స్మరించుకోండి!!

దేశంలో దీపావళి, హెూలీ పండుగలు వస్తుంటాయి. మనం ఇళ్లలో కూర్చుని వుంటాము. అక్కడ వారు అనుక్షణం అప్రమత్తంగా మనకు రక్షణ ఇస్తుంటారు. ఆ ధన్య జవానుల యవ్వనం మరింత ధన్యమైనది.

ఎవరు సిఖ్ఖు? ఎవరు జాట్? ఎవరు మరాఠా? ఎవరు గుర్ఖా? ఎవరు మద్రాసీ? అన్న భేదం లేకుండా సరిహద్దుల్లో మరణిస్తున్న వారందరు అన్ని రకాలుగాను భారతవాసులే! ఆ పర్వతాలలో చిందుతున్న రక్తమంతా హిందూస్తానీయులదే!! వారి త్యాగాలను, బలి దానాలను గుర్తుంచుకోండి.

రక్తధారలతో తూలి పడిపోతున్నా లేచి తిరిగి తుపాకీ అందుకుని ఒక్కొక్కరు పది, పదిమంది శత్రు సైనికులను చంపిన తరువాతే కిందపడి తల వాలుస్తూ చివరి క్షణాలలో "మేము మరణిస్తున్నాము... దేశ ప్రేమికులారా సుఖంగా సంతోషంగా ఉండండి!' అని అంటూ అసువులు బాస్తారు!

ఎంత పిచ్చి దేశ ప్రేమికులు? ఎంతటి దేశాభిమానం వారిది??

వారి త్యాగాలను, బలి దానాలను గుర్తుంచుకోండి!

ఆఫోటోలు, ఆపాటయొక్క భావం, మా తాతగారి జ్ఞాపకాలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేసాయి ఆ నిముషాలలో, మారిపోయిన కాలంలో బండబారిపోతున్న నా హృదయాన్ని ఘనీభవిస్తున్న నా మనసును ఏకకాలంలో అలవోకగా స్పర్శించి కదలి కలను కలిగిస్తూ నన్ను దాదాపు నలభై సంవత్సరాల వెనకకు తీసుకుపోగలిగాయి.

పాట ముగిసింది... మరో పాట ఏదో ప్రారంభమైంది...

నేను కొద్దిగా తేరుకున్నాను... ఇహ అప్పుడు...

దేశంలో ఎక్కడెక్కడున్నారో నా చిన్ననాటి సహాధ్యాయులు... రంగనాథ్, కేశవ్, సుందరరాజ్, శంకర్ గణేష్, దయానిధి, వెంకటేశ్వర్లు, సభాపతి, రెడ్డెన్న, దశనాధన్, పఠాన్ సాబు, సికిందర్‌ఖాన్, ఆంజనేయులు, దేవసహాయం, డేవిడ్, ఖాజాఖాన్, సుందరమూర్తి, శకుంతల, విమలాదేవి, ప్రేమావతి, హైమావతి, శారద, హెలెన్, స్టెల్లా, సరాజున్నిసా... ఇలా అందరూ... గుర్తుపట్టగలిగేలా కొందరు, గుర్తుదొరకని విధంగా మారిపోయి కొందరు... వరుసగా కన్పించి ఉక్కిరి బిక్కిరి చేయసాగారు.

ఎక్కువమంది దేశంలో ఎక్కడెక్కడో ఉన్నత పదవులలో, పెద్ద పెద్ద వ్యాపారాలలో కొనసాగుతున్నట్టు, కొద్దిమంది  ఎగువ, దిగువ మధ్య తరగతి జీవితాలు గడుపుతున్నట్టు, చాలా కొద్దిమంది పేదరికంలో బతుకు బండ్లను లాగిస్తున్నట్లు సంభాషణల ద్వారా తెలిసింది. అయితే అందరూ ఒక్కఇదిగా ఒక్కటైపోయిన భావన, ఆనందం, గతం తాలూకు జ్ఞాపకాల ఉత్సాహాలు, ఉద్వేగాలు... అందరి ముఖాలలో, కళ్లలో, కదలికలలో కన్పించసాగాయి.

నా శ్రీమతి ద్వారా నాకు మరో మంచి సలహా లభ్యమైందన్న మాట వాస్తవం. నేనిక్కడికి రాకుండా వుండివుంటే చాలా గొప్ప ఆనందాన్ని కోల్పోయి వుండేవాడిని. నా శ్రీమతిని కూడా తీసుకు వచ్చివుంటే చాలా బావుండేది అని అన్పించింది.

శ్రీమతి శకుంతల గణనాధుడి ప్రార్థనతో సభ ప్రారంభమైంది.

హయ్యర్ ఎలిమెంటరీ రోజులలో పాఠశాలలో ఎప్పుడు ఏ కార్యక్రమం జరిగినా ప్రార్థనా గీతం శకుంతలే ఆలపించేది. 'హారతినే గైకొనుమా శ్రీకృష్ణ శ్రీదేవితో!'అన్న గీతాన్నే ఎక్కువగా గానం చేసేది ఆమె అప్పట్లో. తెల్లగా, బక్కపలచగా, సన్నగా వుండేది తనప్పుడు. శ్రావ్యమైన కంఠస్వరం!

ఇప్పుడు చాలా లావైంది ఆమె. వయసు తెచ్చిన మార్పులు ఎన్ని వున్నా ముఖం నిండుగా వుంది. కంఠస్వరంలో మార్పే లేదు. శ్రావ్యత తగ్గనే లేదు!

ఆమె ఆలపించింది ప్రార్థనా గీతం కాదు... అమృత గానమే!!

తరువాత కృష్ణమనాయుడు అధ్యక్ష స్థానంనుండీ తొలిపలుకుగా మా పాఠశాలకు సంబంధించిన ఆనాటి అద్భుత విషయాలను అమూల్యంగా ప్రస్తావించాడు. ఆ తరువాత తరువాత ఒక్కొక్కరే స్టేజి మీదకి వచ్చి విద్యార్థి దశ తరువాత తమ జీవన ప్రస్థానంలోని మలుపులను, ఆనంద విషాదాలను, మరచిపోలేని ఘటనలను క్లుప్తంగా వివరించసాగారు.

తన భర్త చేయూతతో, హ్యాండ్‌స్టిక్ సాయంతో హైమవతి స్టేజిమీదకు వెళ్తున్నప్పుడు సమావేశంలోని చాలా మంది బాధపడ్డారు. ఎందుకంటే హయ్యార్ ఎలిమెంటరీ పాఠశాలలోనే అంత చిన్న వయసులో, తెలిసీ తెలియని ఆ అమాయకపు రోజుల్లో మాలో చాలా మంది మనసులను ఉర్రూతలూగించిన చక్కటి అమ్మాయి ఆమె. మాలో చాలామంది ఆమెపట్ల విశేషంగా ఆకర్షించబడ్డాము.

ఆమెకు, ఈమెకు పోలికే లేదు! బాగా బరువెక్కిపోయిన శరీరం. రెండు మోకాళ్లు ఆపరేషన్ చేసుకోగా ఒక కాలి ఆపరేషన్ ఫెయిల్ అవడంవల్ల సంప్రాప్తమైన అవిటితనం ఆమెను బాధిస్తున్నాయి. ఆమె తన ప్రసంగం మధ్యన... "ఈ మోకాలి నొప్పులతో జీవితం క్లిష్టం అయిపోయినప్పుడు, రెండు ఆపరేషన్లలో ఒకటి నిరర్థకం అయిపోయిన తదుపరి కూడా నేను ఎన్నడు ఏ కాస్తయినా డిప్రెషన్‌కు గురి కాలేదు. ఎందుకంటే 'నీకు నేనుండగా ఏమిటి లోటు' అన్నట్టుగా నా భర్త నా శరీరంలో సగభాగమై నిలిచారు. నాకు నా జీవితంలో లోటన్నదే తెలియకుండా చేసారు. అయన శిక్షణలోనే నేను ఒక హార్డ్‌వేర్ ఇంజనీర్ అయ్యాను. ఎలాంటి లోపానికి గురి అయిన కంప్యూటర్ నయినా ఒకటి రెండు గంటలలో సరిచెయ్యగల నేర్పరినయ్యాను. మీలో ఎవ్వరైనా పాడైపోయిన కంప్యూటర్ని నా ముందుంచితే స్క్రీనుమీద చుక్కలను చూసి

సమస్య ఎక్కడుందో చెప్పగల స్థాయిని సంపాదించుకోగలిగాను. ఇదంతా ఆయన ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే సాధ్యమైంది. నా కళ్లు, కాళ్లు, నా గమనం, నా జీవితం అంతా ఆయనే!" అంటూ ఆమె కళ్ల నీళ్లు పెట్టుకున్నప్పుడు సభ స్తంభించింది.

ఆ సమయంలో ఆమె భర్తకు పాదాభివందనం చేయాలనిపించింది!

దయానిధి ప్రసంగం మమ్మల్నందరినీ మరోరకంగా ఉత్తేజపరిచింది.

"మీలో చాలామందికి తెలుసుకదా! నేను మొదటి నుంచి సోమరిపోతునని! అందుకే నాకు చదువుమీదా పెద్దగా శ్రద్ధ లేదు. బొటాబొటి మార్కులతో డిగ్రీ చేతికి రావడమే ఆశ్చర్యం. నా సోమరితనానికి తగినట్టుగానే నాకు ఎక్కడా ఒక్క చిన్న ఉద్యోగమయినా రాలేదు. పెద్దల తాలూకు ఆస్తి పాస్తులు లేవు. నాకున్న ప్లస్‌పాయింట్లు రెండే రెండు. ఒకటి నిండయిన విగ్రహం, రెండు అందమైన రూపం! అయితే వాటిని మాత్రమే చూసి నాకు కన్యనివ్వడానికి ఏ తల్లిదండ్రులు ముందుకురాలేదు. సంబంధాలు చూసి చూసి నా తల్లిదండ్రులు విసిగి వేసారిపోయారు.

చిన్న వయసులో భర్తను కోల్పోయిన సుశీల నా రూపం చూసి నావైపు మొగ్గు చూపింది. విధిలేని పరిస్థితుల్లో వున్న నేను ఆమెను ఉద్ధరిస్తున్న వాడిలా ఫోజుపెట్టి మరీ ఆమెను చేపట్టాను. అయితే ఇన్ని సంవత్సరాలలోను నేనామెను సుఖపెట్టింది ఏమీ లేదు. తనే ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ నన్ను భరిస్తోంది. మా పిల్లలనూ కష్టపడి చదివిస్తోంది.

ఇహ నేనా? తను పెట్టింది తినడం. లైబ్రరీకి వెళ్లి పేపర్లు తిరగేసి ఓ పుస్తకం ఇంటికి తెచ్చుకుని చదువుకోవడం, ఆపై నిద్రపోవడం... లేచాక వాక్ వెళ్లడం! నేటి వరకు ఇదే నా దినచర్య! కనీసం ఇంట్లో అయినా ఇటువున్న ఒక పుల్లనైనా అటువేసే అలవాటు లేదు.

కానీ ఈరోజు మీ అందరి జీవితాలను గూర్చి విన్న తరువాత మీలో ఉన్నత పదవుల్లో వున్నవారు, అత్యున్నత వ్యాపారాలు చేస్తున్నవాళ్లూ, మధ్యతరగతి, పేద జీవితాలను గడుపుతున్నవారు అందరూ కూడా వారి వారి స్థాయిల్లో జీవితంతో, కాలంతో పోరాడి ముందుకు సాగడానికి చేస్తున్న ప్రయత్నాలను, అవలభిస్తున్న విధానాలను గూర్చి తెలుసుకున్న తరువాత నిరంతర జీవన గమనంలో పాలు పంచుకోని నా తప్పు నాకు తెలిసివచ్చింది. 'మరీ నికృష్టంగా జీవిస్తున్నానేమో?' అని నాకే అన్పించింది! ప్రపంచమంతా ప్రచండ వేగంతో పరుగులు తీస్తుంటే నేను ఒక మూలన నిర్లిప్తంగా నిద్రమత్తులో జోగుతున్నానని గ్రహించగలిగాను.

మీలో కొందరి ప్రసంగాలైతే నేను సిగ్గుతో చచ్చిన చావయిపోయేలా నా తప్పుల్ని నాకు తెలియజేసాయి. అప్పుడే ఒక స్థిర నిశ్చయానికి వచ్చాను. అదేమిటంటే రేపటి నుండి నేనూ ఏదో ఒక పని  చేస్తాను. ఎంత చిన్న పనయినా సరే సిగ్గుపడను. నా భార్యా పిల్లల్ని, నా తల్లిదండ్రుల్ని సుఖపెట్టడానికి ప్రయత్నిస్తాను.

ఈ వయసులో ఏం పని చేయగలను? అన్న సంశయం నాకు లేదు! సంవత్సరాల తరబడి గ్రంథ పఠనం  చేయడంవల్ల నాకు ఆంగ్ల, ఆంధ్రభాషల మీద అధికారం వుంది. చక్కటి దస్తూరీ నాకు భగవంతుడు ఇచ్చిన వరం. పైగా సరదాకోసం ఎప్పుడో నేర్చుకున్న డ్రైవింగులో నేను చాలా సమర్ధుడిని. చాలా ఏళ్ల క్రితం తీసుకునివుండిన లైట్ అండ్ హెవీ డ్రైవింగ్ లైసెన్సు అదృష్టవశాత్తు చెల్లుబాటులోనే ఉంటూ వస్తున్నది. అందువల్ల ఎక్కడైనా ప్రైవేటుసంస్థలో గుమాస్తాగానో లేదా ఏ లారీలోనో, ప్రైవేటు బస్సులోనో డ్రైవరుగా నో చేరిపోతాను. ఇకపై కాలాన్ని మాత్రం కాస్తయినా వృధాచేయను.

'తొంభయి తొమ్మిది సంవత్సరాల వయసులో నేలమీద ఒక కాలు, చితిలో ఒక కాలు వుంచుకున్న వృద్ధుడయినా సరే తన జీవితాన్ని మళ్లీ కొత్తగా ప్రారంభించుకోవడానికి ప్రయత్నించవచ్చు... ఆత్మవిశ్వాసం ఉంటే!" అంటాడు ఒక రచయిత. ఆ ఆత్మ విశ్వాసాన్ని మీరందరు కలిసి... ఇక్కడ... ఈ రోజు నాకు కలిగించారు. మీకందరికి సర్వదా కృతజ్ఞుడిని." అంటూ ముగించాడు దయానిధి.

చప్పట్లతో సభ దద్ధరిల్లిపోవడమే కాదు... అప్పటికప్పుడు అతనికి అభినందన పూర్వక సన్మానం జరిగిపోయింది.

దయానిధి ప్రసంగ ప్రభావం అంతా ఇంతా కాదు!

తరువాత మాట్లాడిన మిత్రులు, మిత్రురాళ్లు ఏ కాస్తయినా హిపోక్రసీ అన్నదే లేకుండా అద్భుతంగా తమ తమ అనుభవాలను, ఆకాంక్షలను, ఆశలను, ఆలోచనలను అభివ్యక్తీకరించారు... నాతో సహా!

అధ్యక్షుని మలి పలుకులలో కృష్ణమనాయుడు అమరులైన ఎడ్వర్డ్, మహబూబ్ బాషా, చాముండేశ్వరిలను గురించి అనేక విషయాలను చాలా హృద్యమంగా తెలియజేసాడు. ఆ ముగ్గురికి ఐదు నిముషాల మౌనంతో అందరం నిలుచుని నివాళులు అర్పించాము.

పసందైన విందు ముగిసాక సభా ప్రాంగంలో అందరం కలిసి కూర్చుని ఏ అరమరికలు లేకండా ఒకరితో ఒకరం అలనాటి అమాయకపు రోజులను, తీపి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ముచ్చట్లాడుకున్నాము.

ఐదుగంటల ప్రాంతంలో అక్కడే అల్పాహారం ముగిసాక వందన సమర్పణ గావిస్తూ సద్గుణరావన్నాడు.....

"మిత్రులారా కృతజ్ఞతలు... సెలవు తీసుకునేముందు అందరికీ ఒక్కో డైరీ అందచేయబడుతుంది. అందులో ఇప్పుడు, ఇక్కడ కలుసుకున్న మనందరి చిరునామాలు, ఈ రోజు ఇక్కడికి రాలేకపోయిన కొందరి చిరునామాలు అన్నీ ఫోన్ నంబర్లతో సహావున్నాయి.

వీలయితే ఒకర్నొకరు కలుసుకోవడానికో, కనీసం ఫోనులో పలకరించు కోవడానికో అప్పుడప్పుడు ప్రయత్నిద్దాం. ఏడాదికి ఒక్కమారయినా ఎక్కడో ఓ చోట ఇలా అందరం కలుసుకోవడానికి కూడా ఏర్పాటు చేసుకుందాం.

సమాజం స్వార్ధపూరితంగా యాంత్రికంగా తయారయ్యే స్థితిలో ఉంది. మనిషినవ్వడం, ప్రేమించడం మరచిపోతూ కృతకమైన జీవితానికి అలవాటుపడే దశవైపు అడుగులేస్తున్నాడు. మనమందరం అందుకు అతీతంగా జీవించడానికి ప్రయత్నించాలి. నిజానికైతే జీవితం క్షణ భంగురం. అందువల్ల ఒకటి మాత్రం మనందరం గుర్తుంచుకోవాలి. రేపేం జరుగుతుందో తెలియదు. ఎవరు ముందో, ఎవరు వెనకో అస్సలు తెలియదు! అందువల్ల ఎప్పుడు, ఎక్కడ ఎవరి విమానం పైకెగిరినా తతిమ్మా వారందరికీ సత్వరం కబురు అందేలా చూడాలి మనలో ప్రతి ఒక్కరు కూడా!

చిట్టచివరి మజిలీకి వెళ్లే స్నేహితుడ్ని లేదా స్నేహితురాలిని మాత్రం వీలైనంతవరకు చివరిసారి చూడడానికి, ఆత్మీయ వీడ్కోలు ఇవ్వడానికి ప్రయత్నిద్దాం!"

చివరి మాటలంటున్నప్పుడు సద్గుణరావు గొంతు పూడుకుపోయింది.

కొంతమంది కళ్లు చెమ్మగిల్లడం తెలుస్తూనే ఉంది.

కన్నీళ్లు ఆపుకోలేకపోయిన నేను ఏ భేషజమూ లేకుండా వెళ్లి సద్గుణరావును కౌగలించుకున్నాను మనస్ఫూర్తిగా ఆత్మీయంగా.

***– ఆదివారం ఆంధ్రభూమి 23-3-2014***

# శ్మశానంలో వసంతం

దక్షిణామూర్తికి దేవుడంటే నమ్మకం లేదు. జీవితంలో గుడీ, గోపురం ఎరుగడు.

అతని వివాహమయ్యాక వచ్చిన తొలి ఉగాదినాడు భార్య చేసిన వంటకాలు రుచిచూసి ఆశ్చర్యపోయాడు. గారెలయితే మరింతరుచికరంగా ఉన్నాయి. ఆ విషయం అతనికి ఎంతో ఆనందం కలిగించింది.

ఆ సాయంకాలం కొన్ని గారెలు ఓ ఆకులో పొట్లం కుట్టుకుని, భార్యను కూడా వెంటతీసుకుని బయల్దేరాడు. శ్మశానం దగ్గర అతడు కారు ఆపేసరికి ఆశ్చర్యపోయింది. అతని భార్య సువర్ణ.

సమాదులకు పూజలు చేసుకువెళ్ళడానికి  వచ్చిన మనుషులతో శ్మశానంలో కూడా సందడిగా పండుగ వాతావరణం కన్పిస్తోంది. శ్మశానంలోకి ప్రవేశించిన తరువాత ఒకచోట నాటబడివున్న రాతికూసం కిందనున్న స్థలంలో ఆ గారెలపొట్లాన్ని విప్పదీసి పెట్టి భక్తిగా మొక్కుకున్నాడు దక్షిణామూర్తి. ఆ స్థలం అతని తండ్రి నేల తల్లికి అర్పితమైన ప్రదేశమని అప్పుడే తెలిసింది అతని శ్రీమతికి. ఆపై ప్రతియేటా ఉగాదినాడు వండిన పదార్థాలన్నీ తీసుకొని భర్తతో కలసివెళ్లి శ్మశానంలోని ఆ ప్రదేశంలో నీళ్ళు చల్లి శుద్ధిచేసి, అగరొత్తులు వెలిగించి, తీసుకువెళ్ళిన పదార్థాలను ఆకులో నైవేద్యంచేశాక టెంకాయకొట్టి, కర్పూరం వెలిగించడం మొదలు పెట్టింది అతని శ్రీమతి సువర్ణ. “అబ్బే, ఇవన్నీ ఇక్కడికి తీసుకురావడం అవసరం సువర్ణా, గారెలు తెచ్చిపెడ్తే చాలు!” అనేవాడు దక్షిణామూర్తి.

ఓయేడు మహాలయ పక్షాలలో మనుషులను పెట్టించి ఆ ప్రదేశంలో చక్కటి సమాధిని ముచ్చటగా కట్టించి, గ్రానైట్ రాళ్ళ తాపడంకూడా చేయించింది సువర్ణ. ఆపై భర్తను తీసుకువెళ్ళి చూపించింది... ఆశ్చర్యపరుద్దామని.

“హాయిగా, ప్రశాంతంగా మట్టిలో మట్టయిపడున్న మనిషికి ఊపిరాడకుండా చేశావుకద సువర్ణా!” అని విసుక్కున్నాడు ఆ మనిషి. ఆశ్చర్యపోయింది సువర్ణ... ఆమె కంట కన్నీరొలికింది కూడా... ఆమె కంట తడిచూసి చలించిపోయాడు దక్షిణామూర్తి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/TSA+Katha+2014**

* * *